
# ఎండ



ఎస్.
కాశీ విశ్వనాథం

ఎండ.

ఎండ. ఎండ. మాయదారి ఎండ. ముండమోపి ఎండ. దిక్కుమాలిన ఎండ. అల్లాంటి ఎర్రని ఎండ.

ఆ రోజు ఎండ ఎలా ఉంది? అండ పిండ బ్రహ్మాండాల్ని బద్దలు కొట్టేసేలా ఉంది.

గాలి ఎలా ఉంది? నిప్పుల సముద్రం మీదనుంచి వస్తున్న గాలి భరించలేనంత వేడిగా, భయంకరంగా ఉంది.

రోడ్డు ఎలా ఉంది? భూదేవికి లక్షన్నర డిగ్రీల జ్వరం వచ్చినంత వేడిగా సలసల కాగుతూంది; మలమల మాడుతూంది

నరకం ఎలా ఉంటుంది? ఆ ఎండలో, తారు కరుగుతున్న రోడ్డుమీద జోడు లేకుండా నడిస్తే తెలుస్తుంది.

ఆ ఎండలో, ఆ వేడిలో, ఆ నరకంలో నడుస్తున్నాడు రామ్మూర్తి. నెత్తిమీద గొడుగు లేదు. కాలికి జోడు లేదు. జేబులో కానీ లేదు.

అతను నడుస్తున్నది కాళ్లతోనే!! కాని, అతణ్ణి నడిపిస్తున్నవి మాత్రం పాతిక రూపాయలు. అనగా పాతిక రూపాయలు సంపాదించుట కొరకు మాత్రమే నడుస్తున్నాడు.

అతనికి ఇరవై సంవత్సరాల క్రితమయితే వయసు నలభై ఉండవచ్చును. మునుపు అతనికి ఒంట్లో బలం, ఇంట్లో డబ్బు ఉంటే ఉండవచ్చును. అతను తొడుక్కున్న కమీజు, పంచె ఎప్పుడో,

ఎప్పుడెప్పుడో కొత్తవే అయితే అయి ఉండవచ్చును. నలభై ఏళ్ళ క్రితం అతనికి ముఖాలతోను, నవ్వులతోను కొద్దో గొప్పో సంబంధ ముంటే ఉండవచ్చును.

కాని, ఇప్పుడు అతని ముఖం ముడతలు పడి, బాగా నలిగిపోయిన తెల్లకాగితంలా ఉంది. అతని బట్టలమీద మురికి అరుకేజీలే ఉంటుంది. కమీజుకి రెండంటే రెండే చిరుగు లున్నాయి. జుట్టుకి నూనె రాసి నెలంటే నెలే అయింది. గెడ్డం మూడున్నర అంగుళాలే పెరిగింది. నడుము సగమే వంగింది. ఒంట్లో దుమ్మతే ఉన్నాయి. కడుపులో పేగులే ఉన్నాయి. పేగుల్లో ప్రశస్తమయిన ఆకలే ఉంది. మనసులో కల్తీలేని బాధే ఉంది.

'దీనమ్మా కడుపు మాడ, మాయదారి ఎండ మాడ్చి చంపేస్తోంది. నడుస్తోంటే శోష వచ్చేట్టుంది. . .'

రామ్మూర్తి మూలిగాడు.

రామ్మూర్తి ఆగాడు. అల్లంత దూరంలో ఓ బారెడు నీడ ఆపదలో దొరికిన అభయ హస్తంలా కనిపించగా ఆ నీడలో నిమిషంపాటు ఆగాడు. నిమిషం తరవాత కాలు ముందుకి సాగబోయింది. 'మ్ర్రు'మంది ఎడం కాలు. కిందికి చూశాడు— ఎండలాగ ఎర్రగా కాలుతున్న సిగరెట్‌పీక. తల ఎత్తి చూశాడు. అగ్గిలాగ ఎర్రగా ఉన్న యువకుడు. అతని ఒంట్లో బలం లేదు. బలం లేని ఆ ఒంటిమీద పాతికేళ్ల వయసుంది. దీక్షగా చూస్తే ఎర్ర తేలులా ఉన్నాడు. తిడదామనుకున్నాడు. నోరు పెగల్లేదు. ఎర్రతేలులా ఉన్న ఎవర్ని చూసినా ప్రకాశరావే గుర్తుకొస్తాడు. ఆ యువకుడు క్షణం గమనించకుండా చరచరా వెళ్ళిపోయాడు— ప్రకాశరావులా, తన కొడుకులాగ!

'ప్రకాశరావు, ప్రకాశరావు!' తన కొడుకు. రెక్కలొచ్చినంత వరకూ తన సంపాదనమీదే పెరిగాడు. ఒంటిమీదికి వయసొచ్చింది. ఆలోచనలకు రెక్కలొచ్చాయి. అవి వచ్చిన తరవాత తుర్రుమన్నాడు.

అబ్బబ్బ! ఎండ. ఎండ. ఎండ. రామ్మూర్తి మళ్లీ నడుస్తున్నాడు. కాళ్లు ముందుకి నడుస్తుంటే, మనసు గతంతో మాట్లాడసాగింది. ప్రకాశరావు వెళ్లిపోయాడు. కోపంతో వెళ్లిపోయాడు. తురకదానితో వెళ్లిపోయాడు. అయినా తనేం తప్పు మాట అనలేదే? "శుద్ధ బ్రాహ్మణ పుట్టుక పుట్టి తురకదానితో మహాపాపమేమిట్రా?"—అన్నాడు. అంతే. మరేం అనలేదు. మొదటి రోజు తన మీద ఛర్రుమన్నాడు. రెండో రోజు ఇంట్లోంచి తుర్రుమన్నాడు. తన వార్ధక్యాన్ని, ఇంట్లోని దరిద్రాన్ని, పెళ్లి కాని అక్కని, చదువుకుంటున్న తమ్ముణ్ణి, వీళ్ళందరి కోసం తను చేసిన అప్పుంభారాన్ని గాలి కొదిలేసి, తురకదాన్ని తీసుకొని ఎక్కడికో పోయాడు.

'వెధవ! రక్తపాశాలు, పెంపకాలు, మమతలు, బంధాలు—ఇవన్నీ అబద్ధం, ఒక్క పెళ్లామే నిజమయిన నిజం!'

**వెన్నెలలో ఈదులాడినా, మండుటెండలో పరుగెత్తినా దరిద్రుడిని కనికరించేవాడు ఉంటాడనుకోవడం భ్రమే. జీవితం చిక్కుల వలలో చిక్కి మూలుగుతూంటే జాతకం అమృతం తాగిస్తుందనుకోవడం ఏం లాభం?**

ఇదే వాడు నమ్మాడు— నిరూపించాడు. 'ఛీ ఛీ! వాడా నా కొడుకు? కాదు, కాదు. వాడు నా కొడుకు కానేకాదు. మార్కపాన్ మొగుడు రామ్మూర్తి పంతులు కొడు కెలా అవుతాడు? ఛీ ఛీ ఛీ ఛీ!' తుపుక్కున ఉమ్మేశాడు రోడ్డుమీద. ఉమ్మిని తొక్కుకుంటూ 'బ్ర్రు'మని చప్పుడు చేసుకుంటూ ఏదో పెద్ద లారీ వెళ్లిపోయింది. ధూళి, ధూళి, ధూళి. కళ్లలో ధూళికొట్టి వెళ్లిపోయింది లారీ! మనసులో, బతుకులో దుమ్ము కొట్టి వెళ్లిపోయాడు కొడుకు!

ఒక్క నిమిషం. కంటిలోని ధూళి పోయింది. ఒంటిమీద ఎండే మిగిలింది. అబ్బబ్బ . . . ఎండ! అమ్మమ్మో... ఎండ! ఎండ, ఎండ, ఎండ.

ఓ నిమిషం మహా పలచటి నీడలో విశ్రాంతి. . . నీడ చెదిరింది. కాలు కదిలింది. యానం. అనంత యానం. పాతిక రూపాయల కోసం దిగంతాల వైపు పయనం. వేట, అన్వేషణ, గాలింపు, శోధన, క్వెస్ట్, తలాష్. . . పేరు ఏదైనా, భాష ఏదైనా వేట వేటే! డబ్బు దొరకలేదు. మూడు రోజుల్నించి గాలిలా తిరుగుతున్నాడు. తెలిసినవారిని, తెలియనివారిని, పుణ్యాత్ముల్ని, పాపాత్ముల్ని గోడల్ని, గొడ్డుల్ని, గొడ్డుల్లాంటి మను

# తమసోమా జ్యోతిర్గమయ

నేను కోరుకుంటాను!

సామాన్యుని జీవితం
పచ్చగా పవలు తొడిగి
పెదిమ చివర చిరునవ్వులు
చిందులాడాలని!

అతడు గేదె పెరుగు
లేడిమాంసం కాకున్నా
మట్టి పిడతలో కాస్తంత
మొన్నటి బువ్వ
నేడు అతని ఎండిన డొక్కని
శాంతిపరచి
అశాంతిని నిద్రపుచ్చాలని!

ఆడదైనా, అర్భకుడైనా
నిర్భాగ్య దామోదరుడైనా
యజ్ఞవాటికలో
మంత్రాల వెర్రికి
మోసగించబడిన
మేక కడసారి చూపు
చెప్పిన శాపాల రహస్యాలు
వీరి బ్రతుకును
నిప్పచ్చరం చేయకూడదని
కోరుకుంటాను!

ఎర్ర జండా అయినా,
తెల్ల జండా అయినా,
కపోతమయినా,
గ్రద్దయినా,
భయపెట్టి ప్రజాస్వామ్యం
అభయాల పేర నియంతృత్వం
మానవుణ్ణి బంధించి
కాల్చుకు తినకూడదని
కోరుకుంటాను!!

—ఎల్లోరా

ష్టుల్ని, చివరికి గాలిని, ధూళిని— అందర్నీ అడిగాడు. అందరూ ఒకటే మాట.

"కడుపులో పేగులు, అందులో ఆకలి తప్ప మరో ఆస్తి లేని పేద బ్రాహ్మడివి. నీకు అప్పెవడిస్తాడు? ఇచ్చినా, అ అప్పు ఎలా తీరుస్తావు?"

ఇదీ నిజమే! కొంచెం డబ్బున్నవాడికి మరి కొంచెం అప్పు ఇస్తారు. కాని, ఏమీ లేనివాడికి ఎవరూ, ఏమీ ఇవ్వరు. ఈ సంగతి తనకి తెలియదా? తెలుసు. బాగా తెలుసు. కాని, కాముడి పరీక్ష ఫీజో? కాముడు తన కొడుకే! పరీక్ష ఫీజు కట్టడానికి ఆఖరి రోజు రేపే! ఇదీ తెలుసు. నడక వేగం హెచ్చించాడు.

"ఎందు కింత బాధ? హైదరాబాదు నించి మొన్న వచ్చిన మనియార్డరు తిప్పి కొట్టకుండా ఉంటే నీ కడుపు మంట కొంతయినా తీరునుకదా?"— అంది పక్కింటి ముసిల్ది. ఆ ముసల్దానికి తన కడుపుమంటే తెలుసు; గుండె మంట తెలియదు.

"ఛస్! ఆకలితో ప్రాణాలయినా వదులుతాను కాని, ఆ భ్రష్టురాలు పంపిన డబ్బు ఛస్తే ముట్టను. ముట్టను కాక ముట్టను." ఈ మాట లంటున్నప్పుడు రామ్మూర్తికి కోపం వచ్చింది. ఇప్పుడీ మాటలు జ్ఞాపకాని కొచ్చినప్పుడు కోప మొచ్చింది. కోపంతో రోడ్డు దాటబోయాడు. "ఏయ్, ముసిలోడా! నీకు చావాల్నుందా? రోడ్డు కడ్డంగా నడుస్తున్నావ్?"

ఏదో ఉరుము పలకరించింది. అప్పుడు రామ్మూర్తి చూశాడు. ఎదురుగా దయ్యంలాంటి బస్సు. బస్సుమీద బండరాయంత అక్షరాలు— 'విజయలక్ష్మి బస్ సర్వీస్'. అర్థమయింది. విజయలక్ష్మి బస్సు తనని చంపబోతూ, ఎందుకో దయ తలిచి వెంట్రుకవాసిలో వదిలేసింది. "థాంక్స్— థాంక్యూ వెరీ మచ్!" బస్సు వెళ్లిపోయింది. కాలు సాగింది.


విజయలక్ష్మి బస్. విజయలక్ష్మి. విజయలక్ష్మి. కొన్ని నెలల క్రితంవరకు తన కూతురు. కాదు, కాదు. తన ప్రాణం. ఇప్పుడు? "విజయలక్ష్మిజేమ్స్." మనియార్డరుఫారమ్‌మీదసంతకంఅలానే ఉంది. 'విజయలక్ష్మి బస్సు' కు మనసు లేదు. కాబట్టే తనని చంపలేదు. విజయలక్ష్మికి మనసు ఉంది. కాబట్టే తనని చంపింది— మానసికంగా!

ఆకల్ని జయించింది విజయలక్ష్మి. కష్టాల్ని జయించింది విజయలక్ష్మి. కాని, విజయలక్ష్మిమీద విజయం సాధించింది ఆమె వయసు. వయసు మీద పెత్తనం సాగించింది ఆమె సొగసు. ఆమె సొగసుకి, వయసుకి షోగ్గా కళ్లెం వేశాడు జేమ్స్. ప్రేమని, వయసుని, సొగసుని, విజయలక్ష్మిని కలిపి కట్ట కట్టి తీసుకుపోయాడు జేమ్స్. ఛీ ఛీ! అది తన కూతురా? నిప్పు లాంటి కుటుంబం. కొడుకు తురకదానితో, కూతురు క్రిస్టియన్‌తో— ఛీ ఛీ ఛీ! అబ్బబ్బ! ఎండ. ఎండ. తన బతుకంతా ఎండే! ఎండల్లో కాముడి పరీక్షలు. కాముడు— తన రక్తం. తన రక్తం తన మీద తిరగబడింది— రెండు సార్లు.

రెండు చెట్లకి నారు వేశాడు. నీరు పోశాడు. పెంచాడు. ఫలాలు మాత్రం దక్కలేదు. మనసులోని రాచపుండు మాన లేదు. మళ్ళీ మరో చెట్టుకి తన రక్తాన్ని పోసి పెంచుతున్నాడు. వీడికి రెక్క లొస్తే వీడూ అంతే. . . ఏ బెంగాలీదానితోటో. . . ఛీ ఛీ! కాదు, కాదు. "కాముడు మంచి బాలుడు." పరీక్ష పాసయితే ఉద్యోగం వస్తుంది.

# మార్గదర్శులు

57



## కేప్ హార్న్ చుట్టి వెళ్ళిన మొదటి నావికులు

మొదటిసారి కేప్ హార్న్ (హార్న్ అగ్రం) చుట్టి ప్రయాణం చేసిన ఘనత 360 టన్నుల డచ్చి నౌక యూనిటీలో ఉన్నవారికి దక్కింది. వా రీ ఘనకార్యాన్ని 1616 జనవరిలో సాధించారు.

హాలెండులోని హూర్న్‌నుంచి 1615 మేలో యూనిటీ, 110 టన్నుల హూర్న్ ( ఇంగ్లీషులో హార్న్ ) నౌకలు బయలుదేరాయి. 35 సంవత్సరాల వయసు కలిగిన విలియమ్ స్కౌటెన్ నాయకత్వం క్రింద 90 మంది ఆ నౌకలలో పయనం ప్రారంభించారు. దక్షిణ అమెరికా చుట్టూ తిరిగి ఆవలి వైపు చేరడానికి మరొక మార్గం అన్వేషించడం స్కౌటెన్ లక్ష్యం. అంతవరకు అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాల మధ్య ఉన్న మార్గం మాజిలన్ జలసంధి ఒక్కటే. అది అపాయకరమైన మార్గం. అక్టోబరు 25 వరకు గమ్యం ఏమిటో స్కౌటెన్ ఆ నౌకల లోని వారికి వెల్లడి చేయలేదు.

పోర్టో డిసేడో ( ప్రస్తుతం దక్షిణ ఆర్జెంటైనాలో ఉన్నది ) లో మరమ్మత్తుల కొరకు నౌకలు నిలిపారు. అప్పుడు ప్రమాదవశాత్తు హూర్న్ తగలబడింది. స్కౌటెన్ యూనిటీలో యానం కొనసాగించాడు. ఎట్టకేలకు దక్షిణ అమెరికా చిట్టచివరి అగ్రం కనుగొన్నాడు. దానికి తన జన్మస్థలం హూర్న్ పేరు పెట్టాడు. పసిఫిక్ మహాసముద్రంలో తుఫాను బీభత్సాన్ని ఎదుర్కొని జావా చేరాడు. అక్కడి డచ్చి ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రతినిధి స్కౌటెన్ తన కంపెనీ హక్కులను ఉల్లంఘించాడనే నేరం ఆరోపించి, యూనిటీ వశపరుచుకొన్నాడు. చావగా మిగిలిన సుమారు ఇరవై మంది అనుచరులతో కలిసి స్కౌటెన్ 1617 జూలైలో హాలెండు తిరిగి చేరుకొన్నాడు.

# కోరాడ బృందం కూచిపూడి నృత్యం



కళలు దేవతా ప్రీతికరమైన సంప్రదాయ సముచ్చయాలు. అందులో నృత్యకళ బహు విధ రూపాలలో విశ్వవ్యాప్తమై భారతీయ సంస్కృతిని ఖండాంతరాలలో వినిపిస్తున్నది. భారతదేశంలో భరతనాట్యం, కథకళి, మణిపురి, కూచిపూడి నృత్య సంప్రదాయాలు ఒకదాని సరసన ఒకటి ప్రవర్ధమానమై, ఆయా ప్రాంతీయ సంప్రదాయాల ప్రభావంతో భారతీయ నృత్యకళామతల్లికి మణిదీపాలు వెలిగిస్తూ ప్రపంచ కళావేదికపై గజ్జెల రవళిని వినిపిస్తున్నాయి.

కూచిపూడి నృత్యకళ ఆంధ్రులు తమదిగా చెప్పుకొనే ప్రాచీన శాస్త్రీయ సంప్రదాయం. నేడు ప్రపంచ పరివ్యాప్తమైన విశ్వకళాభిమానుల నీరాజనాలు అందుకొంటున్న ఈ కూచిపూడి నృత్యాన్ని భారతదేశంలో [illegible] అనేక పాశ్చాత్య దేశాలలో ప్రదర్శించిన నాట్యాచార్య కోరాడ నరసింహారావు ప్రభృతులు అభినందనీయులు.

మద్రాసు మ్యూజిక్ అకాడెమీ హాలులో జూన్ 12 వ తేది సాయంత్రం కళాభారతి ఆధ్వర్యంలో శ్రీ కోరాడ నరసింహారావు బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించింది.

ఈ ప్రదర్శనలో కోరాడ 'శివతాండవం' నృత్యం ఉన్నత ప్రమాణాలలో సంప్రదాయానుగుణంగా ఉండి రసహృదయులను మెప్పించింది. కుమారి రాణి 'కృష్ణ శబ్దం'తో ఈ కార్యక్రమం పరాకాష్ఠ చెందింది. ఆమె చూపిన మెలుకువలు నృత్యనందనంలో అరవిచ్చిన పారిజాతాలు.

కోరాడ బృందం 'మండూక శబ్దం', 'దశావతారాలు', 'మహిషాసుర మర్దని' కూడా ప్రదర్శించారు.

—ఎల్లోరా

---

తప్పకుండా ఇస్తానన్నాడు ఓ పెద్ద మనిషి. అందుకు తప్పకుండా పరీక్ష పాసవాలి. అంటే, తప్పకుండా పరీక్షకి వెళ్ళాలి. పరీక్ష. ఫీజు! మూడు రోజుల్నించి కుక్క తిరిగినట్టు. . .

కుక్క, కుక్క. నాయుడుగారి పులి లాంటి కుక్క. రామ్మూర్తి కాళ్ళు ఆగాయి. మనసు ఆగలేదు. మెదడువైపు చూసింది. మనసులో, మెదడులో వెయ్యి ఆలోచనలు. అందులో "మొన్న"— ఎవరో దారిని పోయే దానయ్యని ఆ కుక్క కరిచింది. పాతిక రూపాయలు. అవును. దారిని పోయే దానయ్యకి పాతిక రూపాయలే ఇచ్చారు. ఫ్రీగా ఇచ్చారు. తన కుక్క కరిచినందుకు కాంపెన్సేషన్ కింద పాతిక ఇచ్చారు. అతనికి కుక్కంటే ప్రేమ. నాయుడుగారికి పాతిక ఒక లెక్కా? ఇంట్లో, బాంకిలో, వ్యాపారంలో, పొలాల్లో, బస్సుల్లో ఎందెందు చూచినా అందందే డబ్బు ఉంది తనికి. ఆయన మెడలో బంగారం గొలుసు. ఆయన కుక్క మెడలో వెండి గొలుసు.

వెండి గొలుసు వేసుకున్న బంగారపు కుక్క తనని కరిస్తే? తను చావడు— కాని, కొంచెం బాధ. అయితేనేం? బాధ వలన ఆదాయం పాతిక. పరీక్ష. ఫీజు. ఉద్యోగం. కాళ్ళు నాయుడుగారింటి వైపు నడిచాయి. అది ఇల్లు కాదు; భవనం. అక్కడ మారుటి తల్లి మనసు లాటి ఎండ లేదు. కన్నతల్లి ప్రేమలాంటి చల్లని నీడ ఉంది. కాళ్ళు వణికాయి. వణుకుతున్న కాళ్ళు లోనికి నడిచాయి. కళ్ళు వెదికాయి. 'కుక్కేది? లేదే! ఎక్కడుంది? ఎక్కడుంది? కుక్కా, కుక్కా, నన్ను కరు, కరు. నన్ను కరుణించి కరు. నీకు పుణ్యముంటుంది కరు. దేవుడా, దేవుడా! కుక్క కరవాలి, దేవుడా, దేవుడా. . .'

భౌం భౌం భౌం! "అమ్మో!" కరిచింది, కరిచింది. కుక్క కరిచింది. కరిచి బయటికి పారిపోయింది. నల్లమచ్చల తెల్లకుక్క. అమ్మో, అమ్మో! అయ్యో, అయ్యో! "నన్ను కుక్క కరిచింది. అబ్బా, బాధ. కుక్క కరిచిందర్రా, బాబూ, ఎవరూ రారేం?" రామ్మూర్తి గోల, గోల.

జనం వచ్చారు. అయ్యో, రక్తం! అయ్యయ్యో, రక్తం! అవునవును, రక్తం! ఎర్రటి, వెచ్చటి, ఉప్పటి, వెచ్చటి రక్తం. ముసలి రక్తం. ఆకలి రక్తం. తండ్రి రక్తం.

మరి కొంతమంది జనం వచ్చారు. నాయుడు రాలేదు. "వెధవకుక్క. ముండమోపి కుక్క. తిట్టకండి, తిట్టకండి. అది వెండి గొలుసు వేసుకున్న బంగారపు కుక్క." రామ్మూర్తి మనసు, కళ్ళు, ముక్కు, చెవులు సర్వం నాయుడి కోసం ఎదురు చూస్తున్నాయి. 'దేవుడా, దేవుడా, నాయుడు రావాలి. చూడాలి, చూడాలి కుక్కకాటు. ఇవ్వాలి, ఇవ్వాలి పెద్ద నోటు.'

నాయుడు రాలేదు. రక్తం వస్తోంది. 'అయ్యో, అయ్యో, దేవుడా, నిన్నే నమ్మాను. కొడుకు మోసగించాడు. కూతురు మోసగించింది. చివరికి నువ్వూనా?' దేవుడు మోసగించలేదు. నాయుణ్ణి పంపాడు. "ఏమిటిది?" "ఈ ముసిలాణ్ణి మీ కుక్క కరిచింది, సార్!" "మా కుక్కా?!" "అవును, మీ కుక్కే." నాయుడు చేతులు జేబుల్లోకి వెళ్ళాయి. 'తీస్తున్నాడు. తీస్తున్నాడు. హాయ్ హాయ్ తీస్తున్నాడు. పెద్ద నోట్లు తీస్తున్నాడు.' రామ్మూర్తి మనసు రక్తపు ధారల మధ్య ఒక్క క్షణం రాగాలాపన చేసింది. నాయుడు జేబులోనుంచి డబ్బు తియ్యలేదు— సిగరెట్ తీశాడు.

"మిమ్మల్ని కరిచిన కుక్కని మీరు చూశారా?" "చూశాను, సార్. ఇదిగో, ఇక్కడే కరిచింది. అమ్మా, అబ్బా, బాధ "అది కొంపతీసి నల్లమచ్చల కుక్క కాదుగదా?" "అవునవును. అదే, అదే. కరిచి ఇదిగో ఇటే పారిపోయింది." "సారీ, అది మా కుక్క కాదు. మా కుక్క కాట్లు నేరుస్తోందని నిన్ననే మా అమ్మాయి దగ్గరికి పంపేశాను." అయ్యో, అయ్యో, అయ్యో! "మరి ఈ కుక్క. . ." "ఇది పిచ్చికుక్క. నిన్నటి నుంచి మా పోర్టికోలోనే తిరుగుతోంది. ఎవరిదో తెలీదు గాని, చాలా మందిని కరిచిందట. తీసుకుపొమ్మని మునిసిపాలిటీకి ఫోన్ చేశాను. ఈలోగా పాపం, ఈ ముసిలాణ్ణి కరిచేసింది. మీరు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళండి. లేకపోతే ప్రమాదం. కుక్క చచ్చిందంటే మనిషి ప్రాణానికే ప్రమాదం. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళండి. క్విక్!"

అంతే! ఆ తరవాత నాయుడుగారి చేతులు జేబుల్లోకి వెళ్ళలేదు. కాళ్ళు మాత్రం భవనంలోకి వెళ్ళిపోయాయి. రామ్మూర్తి శరీరం మాత్రం రిక్షాలోకి వెళ్ళిపోయింది. రిక్షా మాత్రం ఆసుపత్రికి వెళ్ళిపోయింది. రక్తం మాత్రం కారుతూనే ఉంది. విషం మాత్రం ఒంటిలోకి ఎక్కుతూనే ఉంది. ఎండ మాత్రం ఇంకా కాస్తూనే ఉంది. *